పచ్చదనం కనుమరుగు

- గ్రీన్‌బెల్ట్‌కు రక్షణ కరవు
- నిర్వహణ లేక కళతప్పిన పార్కులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


సత్యం సెంటర్ వద్ద గ్రీన్‌బెల్ట్ పార్కులో ఊడిపడిన ఐరన్ గేటు


ధ్వంసమైన పార్కు ఫెన్సింగ్


వాకింగ్ ట్రాక్‌లో కనుమరుగైన పచ్చదనం

సీతంపేట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి, ఆహ్లాదానికి ఎంతో ప్రాధాన్యమిచ్చింది. ప్రజలు కాసేపు సేదతీరేలా, ఆరోగ్యానికి వ్యాయామం చేసేలా ఉత్తర నియోజకవర్గంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు, చిల్డ్రన్‌ప్లే ఏరియా, ఓపెన్ జిమ్‌లతో గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని ఆహ్లాదంగా, సుందరంగా మలిచారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటి నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో గ్రీన్‌బెల్ట్‌లో పచ్చదనం కనుమరుగైంది. రక్షణగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, గేట్లు ధ్వంసమయ్యాయి. కొన్నిచోట్ల అభివృద్ధి పనులు సగంలోనే ఆగిపోయాయి.

కళావిహీనంగా గ్రీన్‌బెల్ట్..

జీవీఎంసీ 25వ వార్డు సత్యం కూడలి వద్ద హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో 500 మీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ట్రాక్‌కు ఇరువైపులా, మధ్యలో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించారు. పార్కుకు రక్షణగా చుట్టూ ఐరన్ ఫెన్సింగ్, ఒకవైపు గేటు ఏర్పాటు చేసి స్థానికులకు నిర్వహణ బాధ్యత అప్పగించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పార్కు నిర్వహణ సరిగా లేక పార్కులో వేసిన మొక్కలు మాయమయ్యాయి. పచ్చదనం హరించుకుపోయి కళావిహీనమైంది. ఫెన్సింగ్ కొంత భాగం ధ్వంసమైంది. పార్కులోని ప్రవేశ ద్వారంగా ఏర్పాటు చేసిన ఐరన్ గేటు ఊడిపోయింది.

అంధకారంలో పార్కు..

లక్షలు ఖర్చు పెట్టి అభివృద్ధి చేసిన సత్యం సెంటర్ గ్రీన్‌బెల్ట్ పార్కులో విద్యుత్ దీపాలు ఏర్పాటు మరిచారు. దీంతో చీకటి పడితే ఈ పార్కు ఆకతాయిలకు అడ్డాగా మారుతోంది. మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లు ఇక్కడ హల్‌చల్ చేస్తున్నారని


అంధకారంలో గ్రీన్‌బెల్ట్ పార్కు

స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్కులో లైట్లు లేక రాత్రి 8 గంటలు దాటాక మందుబాబులతో ఇబ్బంది పడుతున్నట్టు చెబుతున్నారు. వీరి వల్ల మహిళలు, ఆడ పిల్లలు అటుగా వెళ్లడానికి, ఇంటి బయట కూర్చోడానికి భయపడుతున్నారు.

అసంపూర్తిగా పనులు..

జీవీఎంసీ 44వ వార్డు అక్కయ్యపాలెం హైవే వద్ద పల్లవి ఎన్‌క్లేవ్ సమీపంలోని గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో గత ప్రభుత్వం హయాంలో బుద్ధ పార్కును అభివృద్ధి చేశారు. పనులు సగం జరిగాక ఎన్నికల కోడ్ రావడంతో వాటిని నిలిపివేశారు. ఎన్నికలు ముగిశాక పార్కు అభివృద్ధి పనులు పూర్తికాక మధ్యలో ఆగిపోయాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవ్వడమే కాక, అభివృద్ధి చేసిన ప్రాంతంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి రోత పుట్టిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని సంరక్షించాలని, పార్కు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పార్కులో లైట్లు ఏర్పాటు చేయాలి



సత్యం సెంటర్‌లోని గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో అభివృద్ధి చేసిన పార్కులో విద్యుత్ దీపాలు లేక రాత్రయితే ఆకతాయిలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తక్షణం లైట్లు ఏర్పాటు చేయాలి. పార్కు ఫెన్సింగ్, గేటు ధ్వంసమయ్యాయి. వాటిని పునరుద్ధరించాలి.

– ఉప్పాడ కుమారి, గణేష్‌నగర్

గ్రీన్‌బెల్ట్‌లో మొక్కలు నాటాలి



గతంలో గ్రీన్‌బెల్ట్ పార్కులో నాటిన మొక్కలు మాయమయ్యాయి. దీంతో పార్కులో పచ్చదనం కరువైంది. వర్షా కాలం నేపథ్యంలో పార్కులో వాకింగ్ ట్రాక్ చుట్టూ, మధ్యలో ఆకర్షణీయమైన మొక్కలు నాటి ప్రజలకు ఆహ్లాదాన్ని ఇచ్చేలా తీర్చిదిద్దాలి.

– పి.సన్యాసమ్మ, గణేష్‌నగర్

నాయకుల విగ్రహాలకు తొలగిన ముసుగులు


ఇందిరాగాంధీ పార్కులో ముసుగులు తొలగించి ఉన్న నేతల విగ్రహాలు

సీతమ్మధార: రాజకీయ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది తొలగించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించడంతో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్కులోని దివంగత ప్రధాని ఇందిరాగాంధీ, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ముసుగులు వేశారు. సత్యం జంక్షన్, గురుద్వారా తదితర ప్రాంతాల్లోని రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవం ఎన్నిక కావడంతో జీవీఎంసీ అధికారుల ఆధ్వర్యంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను తొలగించారు.

ఉత్పత్తుల్లో నాణ్యతకు ప్రాధాన్యం


అధ్యాపకులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య


పాల్గొన్న మెకానికల్ ఇంజినీరింగు ఫ్యాకల్టీ

మురళీనగర్: పరిశ్రమలు అందించే ఉత్పత్తుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఉందని ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్, విజయనగరం జేఎన్‌టీయూ పూర్వ వైస్ చాన్సలర్ డాక్టర్ కె. వెంకట సుబ్బయ్య అన్నారు. ఏపీసీటీ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జాతీయ స్థాయిలో ×నాణ్యత నిర్వహణ×పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న మెకానికల్ విభాగం అధ్యాపకులు కంపెనీ ఉత్పత్తులకు సంబంధించిన నాణ్యత పరిశీలన లాజిస్టిక్ మేనేజిమెంటుపై పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. గెయిల్ ఇండియా జనరల్ మేనేజర్ రామకృష్ణ పుట్ల మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రతి ఇంజినీర్‌కి వివిధ ఉత్పత్తి రంగాల్లో నాణ్యత నిర్వహణ తప్పనిసరిగా తెలిసి ఉండాలన్నారు. ఎఫ్‌డీపీ కోఆర్డినేటరు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి బ్యాచ్‌లో 50 మందికి వారం రోజుల పాటు శిక్షణనిస్తామన్నారు. కార్యక్రమంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ఏజీఎం బి.విజయకుమార్, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి వోఎస్‌డీ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, మెకానికల్ హెడ్ కె.మధుకుమార్, 50 మంది మెకానికల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపం వద్ద శిథిలమైన ప్రవేశ మార్గానికి ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు పూర్తి చేశారు. ఈ మండపం పైఅంతస్తులో 24వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఉంది. దీంతో సిబ్బంది, పారిశుధ్య కార్మికులు అధిక సంఖ్యలో పలు పనుల మీద ఇక్కడికి వస్తుంటారు. ఆర్పీ కార్యాలయం కూడా ఇక్కడే ఉంది. ఆఫీస్‌కు వచ్చే వారు కల్వర్టు దాటి వెళ్లాలి. మండపం ప్రవేశ మార్గం వద్ద గల కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై 'ప్రమాదకరంగా శిథిల కల్వర్టు' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ జోన్–3 ఇంజినీర్లు తక్షణం స్పందించారు. కార్మికుల చేత కల్వర్టుకు మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు, శానిటరీ కార్యాలయానికి వచ్చే వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వివేకానంద కల్యాణ మండపం వద్ద కల్వర్టుకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ

డాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ప్రజా రవాణాతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం మేయర్ తిరిగి ఆర్టీసీ బస్సులో బంగ్లాకు వెళ్లారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ బ్యాటరీ వాహనంలో కార్యాలయానికి చేరుకున్నారు.


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

చెరిగిపోనిది.. రాఖీ బంధం


ద్వారకా ఎస్‌ఐ ధర్మేంద్రకు రాఖీ కడుతున్న కానిస్టేబుల్ మౌనిక


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ

కంచరపాలెం: అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్ వేడుకలు సోమవారం అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు ఘనంగా జరుపుకున్నారు. కంచరపాలెం, కప్పరాడ, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, జ్ఞానాపురం, సంజీవయ్య కాలనీ, బర్మాక్యాంప్, గొల్లకంచరపాలెం, దుర్గానగర్, గౌరీనగర్, సిద్ధార్థనగర్, ఆశవానిపాలెం, బాపూజీనగర్, శ్యామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో అన్నలకు చెల్లెళ్లు, తమ్ములకు అక్కలు ఆత్మీయంగా రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి ఆశీస్సులు పొందారు. సోదరులు ప్రేమతో వివిధ కానుకలు అందజేశారు. రాఖీ వేడుకలతో వీధులన్నీ కళకళలాడుతూ కనిపించాయి. కంచరపాలెంలోని పలు పాఠశాలల్లో విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టారు.

ఆత్మీయంగా.. ఆనందంగా

సీతమ్మధార: సీతమ్మధారలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ధర్మేంద్రకు కానిస్టేబుల్ మౌనిక రాఖీ కట్టి స్వీట్ తినిపించి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

- బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు బ్రహ్మకుమారీస్ సోదరి రాఖీ కట్టి, మిఠాయి తినిపించి సోదరభావాన్ని చాటారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు

తాటిచెట్లపాలెం: ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాఖీ పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. రైల్వే న్యూకాలనీ శాఖ ముఖ్య సంచాలకులు రాజయోగిని బ్రహ్మకుమారి శశికళ సేవా కేంద్రంలో సుమారు 300 మంది బ్రహ్మకుమారి సోదర, సోదరీలు రక్షాబంధన్ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. బ్రహ్మకుమారి శశికళ దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయంలో డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్‌ఎం, డీపీవో, ఏపీవో, పీవో, సిబ్బందికి రాఖీలు కట్టారు. ఉత్తర ఎమ్మెల్యేకు, రవాణా శాఖ, కస్టమ్స్, పోర్ట్, ఎయిర్‌పోర్ట్ కార్యాలయాల్లో సిబ్బందికి, ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బందికి బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి సోదరభావం చాటారు.

గాంధీ సెంటర్‌లో...

సీతంపేట: ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థ, ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంయుక్తంగా సోమవారం బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. బ్రహ్మకుమారి సభ్యులు రమ తదితరులు గాంధీ సెంటర్ అధ్యక్షులు ఆచార్య వి.బాలమోహన్‌దాస్, నరవ ప్రకాశరావులకు రాఖీలు కట్టి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ రక్షాబంధన్ జరుపుకోవడం ద్వారా మానవతా విలువలు, అన్నాచెల్లెళ్ల అనుబంధం, వారి రక్షణకు పునరంకితం కావాలన్నారు. కార్యక్రమంలో హుస్సేన్, అహ్మద్ మున్నార్, చాట్ల బాబూరావు, కె.వి.ఎస్.ఎన్.మూర్తి, హరగోపాల్, ఉండవల్లి సుజాత పాల్గొన్నారు.


డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి శశికళ



104 ఏరియాలో రాఖీ కడుతున్న అక్క, కంచరపాలెంలో అన్నాతమ్ముళ్లకు రాఖీలు కడుతున్న అక్కాచెల్లెళ్లు


ఆచార్య బాలమోహన్‌దాస్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి రమ

యూజీడీ లీకుతో అవస్థలు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు నందగిరినగర్‌లోని చెక్కుడురాయి బిల్డింగ్ వెనుక రోడ్డులో 44–34–35/1 ఇంటి నంబర్ వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగునీరు రోడ్డెక్కి ప్రవహిస్తుండటంతో వారం రోజులుగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


నందగిరినగర్‌లో లీకవుతున్న మ్యాన్‌హోల్

31న మహిళా న్యాయవాదులకు వర్క్‌షాప్

సీతంపేట: మహిళా న్యాయవాదులకు ఈ నెల 31న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు మహిళా న్యాయవాదుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పప్పు అనురాధ, పి.హేమమాలిని తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం విలేకరులతో వారు మాట్లాడారు. వర్క్ షాప్‌నకు ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వి.ఎస్.భానుమతి, గౌరవ అతిథిగా తెలంగాణ హైకోర్టు జడ్జి ప్రియదర్శిని, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి, విశాఖ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి రవినాథ్, విశాఖ బార్ అసోసియేషన్ ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కోర్టు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపడుతున్నట్టు తెలిపారు. మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలపాలని కోరారు. ఈసమావేశంలో కోశాధికారి బి.రమాదేవి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయవాదులు అనురాధ, హేమమాలిని

పవర్ లిఫ్టింగ్‌లో 12 మందికి పతకాలు


పతకాలు సాధించిన విజేతలను అభినందిస్తున్న మధుకుమార్ తదితరులు

సీతంపేట: విశాఖ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఇటీవల నగరంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పురుషులు, మహిళల పోటీల్లో బుల్లయ్య కళాశాల జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు 12 మంది పతకాలు సాధించారు. పలు విభాగాల్లో 5 బంగారు, 4 రజత, 3 కాంస్య పతకాలతో సత్తా చాటారు. ఈ సందర్భంగా సోమవారం వీరిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపాళ్లు జి.ఎస్.కె.చక్రవర్తి, డి.దీపక్ చౌదరి, కె.సోమేశ్వరరెడ్డి, అసిస్టెంట్ డీన్ టి.బ్రహ్మానందరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్లు బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, గంగాభవాని అభినందించారు.

24 కేజీల గంజాయి స్వాధీనం


నిందితుడితో రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న యువకుడ్ని రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గవర్నమెంట్ రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే భద్రతా దళం(ఆర్పీయఫ్) ఉన్నతాధికారులు ఆదేశాలతో ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ శివనారాయణ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాలను తనిఖీలు నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన నూరుద్దీన్ గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. విశాఖ మీదుగా హౌరాకు తరలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. సుమారు రూ.1.20 లక్షల విలువైన 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

గంజాయి కేసుల్లో పాత నేరస్తుల అరెస్ట్

సీతమ్మధార: గంజాయి కేసుల్లో పాత నేరస్తులను ఫోర్త్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. డుంబ్రిగుడకు చెందిన ముగ్గురు వ్యక్తులపై 2023, 2024ల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు కేసులు నమోదయ్యాయి. అప్పటి నుంచి వారు పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతుండగా.. ఇటీవల ఎస్‌ఐ జి.వెంకటరావు సిబ్బందితో కలిసి చాకచక్యంగా పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ బొత్సకు సత్కారం


బొత్స సత్యనారాయణను సత్కరిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

సీతమ్మధార: స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అభినందనలు తెలిపారు. సోమవారం సిరిపురంలోని బొత్స నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పలురువు నాయకులు పాల్గొన్నారు.

విశాఖ-భగత్ కి కోటి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: పశ్చిమ మధ్య రైల్వే, జబల్‌పూర్ డివిజన్ కట్నిముర్వా–బినా సెక్షన్‌ల పరిధిలో జరుగుతున్న ఆధునీకరణ పనుల నిమిత్త ఈ మార్గంలో నడిచే విశాఖపట్నం–భగత్ కి కోటి–విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. విశాఖపట్నం–భగత్ కి కోటి (18573) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29న, భగత్ కి కోటి –విశాఖపట్నం (18574) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31న రద్దు చేయబడింది.

'పరిష్కార వేదిక'కు 10 వినతులు


అర్జీదారు సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ రమేష్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 10 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్‌ఐ ఇబ్రహీం, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం


వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి జెడ్సీ మత్స్యరాజు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ మత్స్యరాజు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌కు 02, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ మత్స్యరాజు, ఏసీపీ వెంకటరావు, ఆర్వో రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందన

మురళీనగర్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు మురళీనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. సోమవారం ఆయనను టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కె.వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాతో సత్కరించారు.